ప్రజాశక్తి

ఆదివారం ఏప్రిల్ 28 2024 8 పేజీలు

శ్రీకాకుళం

రూ.1.21 లక్షల నగదు పట్టివేత

(6లో)

రానున్న రెండు వారాలు కీలకం

ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు రానున్న రెండు వారాలు అత్యంత కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి అన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి ముగ్గురు ఎన్నికల పరిశీలకులు, మరో ఇద్దరు పరిశీలకులు ఎన్నికల నోడల్ అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి ఎన్నికల (మిగతా...2లో)

బిజెపి 'అణు' చెలగాటం

- వద్దంటున్న వినాశక పరిశ్రమ ఏర్పాటు
- ఇవ్వాల్సిన విభజన హామీలపై నీళ్లు
- సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - రణస్థలం

రణస్థలం మండలం కొవ్వాడలో ప్రమాదకర అణుపార్కును ఏర్పాటు చేసి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జిల్లా ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావును గెలిపించాలని కోరుతూ సిపిఎం, కాంగ్రెస్ నాయకులు పలు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఇండియా ఫోరం ఎన్నికల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మానవ తప్పిదం వల్ల గానీ, (మిగతా...2లో)

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పలాస

ప్రచారం చేస్తున్న రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష

టిడిపి ప్రభుత్వం అధికారంలోకొస్తే జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, రైతులకు ఆదుకుంటామని ఎంపీ రామ్మోహన్ నాయుడు హామీనిచ్చారు. మండలంలోని బొడ్డపాడు, మాకన్నపల్లి, నీలావతి, గురుదాసుపురం, మామిడిమెట్టు, లొద్దభద్ర, తర్లకోట పంచాయతీల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో జీడి, కొబ్బరి బోర్డులను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. టిడిపి హయాంలో జీడి పిక్కల బస్తా రూ.14 వేలు ఉంటే, వైసిపి ప్రభుత్వం వచ్చాక బస్తా రూ.ఏడు వేలకు (మిగతా...2లో)

నేడు షర్మిల రాక

టెక్కలి, పలాసలో బహిరంగ సభలు

ప్రజాశక్తి - టెక్కలి

న్యాయ్ యాత్రలో భాగంగా పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఈనెల 28వ తేదీన జిల్లాకు రానున్నట్లు డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలిలోని ఇందిరాగాంధీ కూడలి వద్ద సాయంత్రం నాలుగు గంటలకు, పలాసలోని పాతబస్టాండ్ ఆవరణలో రాత్రి ఏడు గంటలకు నిర్వహించే బహిరంగ సభల్లో ఆమె ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభల్లో ఇండియా ఫోరం తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను పరిచయం చేస్తారని తెలిపారు. ఈ యాత్రలో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఇండియా ఫోరం పార్టీల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మామా అల్లుళ్లపై ఇసికి ఫిర్యాదు

- ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం
- స్వతంత్ర అభ్యర్థి గాంధీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస వైసిపి, టిడిపి అభ్యర్థులు... మామా అల్లుళ్లు తమ్మినేని సీతారాం, కూన రవికుమార్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ తెలిపారు. వారిద్దరూ ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. స్థానిక తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభ స్పీకర్‌గా ఉన్న సీతారాం తన నామినేషన్ పత్రాల్లో తప్పుడు సమాచారంతో అఫిడవిట్లు జత చేశారని ఆరోపించారు. గత, ప్రస్తుత ఎన్నికల నామినేషన్ల పత్రాల్లో తన విద్యార్హతపై స్పష్టత లేని వివరాలు (మిగతా...2లో)

సమావేశంలో మాట్లాడుతున్న సువ్వారి గాంధీ

చంద్రబాబు హామీలను నమ్మడం లేదు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేశారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. ప్రతి ఎన్నికల ముందు మేనిఫెస్టోను విడుదల చేసి హామీలను అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేసేవాడని, అందుకు భిన్నంగా జగన్మోహన్ రెడ్డి శతశాతం నెరవేర్చారని చెప్పారు. నగరంలోని శ్రీశయన కళ్యాణ మండపంలో ఆ సామాజిక తరగతి ముఖ్య నాయకులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వంశధార ప్రాజెక్టు నుంచి వరద నీటిని వినియోగించుకునేందుకు కృషి చేశారని చెప్పారు. వంశధార ప్రాజెక్టు నిర్మాణానికి కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి పెద్దఎత్తున నిధులు ఇచ్చారని, ఆయన వారసుడు జగన్మోహన్ రెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రాజెక్టుకు నది నుంచి (మిగతా...2లో)

మాట్లాడుతున్న పేరాడ తిలక్

బాబు హామీల డప్పు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత ఇరువురూ ఒకేసారి జిల్లాకు రావడం, నైట్ హాల్ట్ ఇక్కడే ఉండడం చాలా అరుదుగా తటస్థిస్తుంది. ఎన్నికల నేపథ్యంలో ప్రచారం కోసం ఇద్దరూ ఈ నెల 23న పర్యటనకు రావడంతో ప్రచారం హోరెత్తింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగింపు సందర్భంగా టెక్కలిలో 24 నిర్వహించిన బహిరంగసభలో పాల్గొన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈనెల 23న పాతపట్నం, ఆమదాలవలసలో నిర్వహించిన ప్రజాగళం సభల్లో, మరుసటి రోజు శ్రీకాకుళంలో మహిళలతో నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సభకు జనాన్ని భారీగా తరలించినా ఆ ఊపును పార్టీకి, ప్రభుత్వానికి మలుచుకోవడంలో విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిఎం ప్రసంగమంతా సంక్షేమ పథకాలు, నగదు బదిలీ, చంద్రబాబుపై రాజకీయ విమర్శల చుట్టే సాగింది. ప్రసంగంలోనూ కొత్తదనం కనిపించలేదు. పాత అంశాలపైనే మాట్లాడడంతో పెద్దగా ఆకట్టుకో లేకపోయింది. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు అందులోనూ ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న సభ కావడంతో, జిల్లా అభివృద్ధికి సిఎం ప్రకటించే హామీలు, వరాల పైనే సహజంగా అందరిలో ఆసక్తి ఉంటుంది. జిల్లాకు సంబంధించి ఒక్క హామీ లేకపోవడం జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసింది.

చంద్రబాబు విషయానికి వస్తే పాతపట్నం, ఆమదాలవలస సభలు రెండింటిలోనూ తెగ హామీలు గుప్పించారు. జనానికి అరచేతిలో వైకుంఠం చూపించారు. యువతకు వర్క్ ఫ్రమ్ హోం అంటూ ఊహల్లో తేలించారు. టిడిపిని గెలిపిస్తే జిల్లా నుంచి వలసలే ఉండవని (మిగతా...2లో)

మొదటి పేజీ తరువాయి

బాబు హామీల డప్పు

చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోనే కాదు, దేశంలో ఏ మూలకు వెళ్లినా సిక్కోలు వాసులే కూలీలుగా ఉంటారని, అక్కడి నగరాల్లో శ్రీకాకుళం కాలనీలే ఉంటాయంటూ తెగ ఆవేదన వెలిబుచ్చారు. 2014లో టిడిపి గెలిచి ఐదేళ్లు పాలించిన తర్వాత ఏమేరకు వలసలు ఆగాయో అందరికీ తెలిసిందే. ఇప్పటికీ జిల్లా నుంచి ముఖ్యంగా పాతపట్నం ప్రాంతం నుంచి వలసల పరంపర ఆగడం లేదు. వంశధార పూర్తి చేస్తాం, విద్యాసంస్థలు ఏర్పాటు, నారాయణపురం ఆధునీకరణ పనులు, ఆమదాలవలసకు ఇంజినీరింగ్ కళాశాల, పాతపట్నానికి మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు ఇలా చెప్పుకుంటూ పోతో డజను వాగ్దానాలు చేశారు. జనం ఓట్లు పొంది ఏదోరకంగా గట్టెక్కాలని చూస్తున్న బాబు, ఇస్తున్న హామీలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. హామీలేమైనా నెరవేరుతాయా అంటే అదీ సందేహమే. చంద్రబాబు ముఖ్యమంత్రిగా జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు పలు సందర్భాల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయో అందరికీ తెలిసిందే.

ప్రాజెక్టు వల్ల ప్రజలకు మేలు కలిగినట్లుగానే, రైతులకు పరిహారం అందించాలన్నది తన ఆలోచన అని చెప్పుకొచ్చారు. నిర్వాసితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు, వారికి ఏరకంగా న్యాయం చేస్తారో మాత్రం చెప్పలేదు. నిర్వాసితులకు భూసేకరణ చట్టం-2013 అమలు చేయకుండా జగన్ మోసం చేశారంటూ పదేపదే చెప్తున్న చంద్రబాబు, తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామని మాత్రం చెప్పలేదు. నిర్వాసితులకు న్యాయం పక్కన పెడితే, వారికి అన్యాయం చేసిన పాతపట్నం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణకు మాత్రం న్యాయం చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాతపట్నం టిక్కెట్‌ను నిరాకరించడంతో అలకబూనిన కలమటను చంద్రబాబు తను బస చేసిన శ్రీకాకుళం నగరంలోని టిడిపి కార్యాలయానికి పిలిపించి బుజ్జగించారు. పాతపట్నంలో మామిడి గోవిందరావును గెలుపునకు పనిచేయాలని సూచించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామంటూ ఆ రోజే టిడిపి జిల్లా అధ్యక్షునిగా పట్టాభిషిక్తున్ని చేశారు. కలమటకు బాబు కిరీటం పెట్టినా, పాతపట్నంలో టిడిపికి ఎంతమేరకు విజయం దక్కుతుందో చూడాల్సి ఉంది. ఇప్పటివరకు ఇద్దరూ కలిసి ప్రచారంలో ఇంకా పాల్గొనలేదు. టిక్కెట్ రాకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలమట, ఒకానొక దశలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు ప్రయత్నించారు. కలమట గ్రూపులో ఒక్కొక్కరుగా మామిడి గోవిందరావు పక్షాన చేరుతుండడం, ఇండిపెండెంట్‌గా వేస్తే పార్టీ నుంచి బహిష్కరణ వేటుకు గురికావడం, కేడర్‌కు భవిష్యత్ లేకపోవడం వంటి కారణాలతో మనసు మార్చుకుని అధ్యక్ష పదవితో సరిపెట్టుకున్నారు. ఇందులో కింజరాపు కుటుంబం కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది.

శ్రీకాకుళంలో గుండ లక్ష్మీదేవి, పాతపట్నంలో కలమట వెంకటరమణకు తప్పించడంతో అది ఎంపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడు గెలుపుపై ప్రభావం చూపుతుందన్న ఫీడ్‌బ్యాక్‌తో కలమటను శాంతింపజేసేందుకు అధ్యక్ష పదవిని కట్టబెట్టినట్లు తెలిసింది. గుండ దంపతుల విషయంలో ఆ పాచిక పారలేదు. బాబు ప్రతిపాదనను వారు ససేమిరా అంటూ క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. నియోజకవర్గంలో టిడిపికి నష్టం వాటిల్లే అవకాశాలు ఉండడంతో, నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడే స్వయంగా రంగంలోని దిగారు. శ్రీకాకుళం నగరంలోని అంధవరపు వరం కుటుంబాన్ని పార్టీలో చేర్చుకుని బలం పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ రాకుండా కింజరాపు కుటుంబం చేసిందన్న అక్కసుతో గార, అరసవల్లికి చెందిన టిడిపి కేడర్ వైసిపిలో చేరింది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మరిన్ని పరిణామాలు సంభవించే అవకాశాలు లేకపోలేదు. దీంతో టిడిపి, వైసిపి మధ్య పోరు హోరాహోరిగా సాగే అవకాశం ఉంది. ఇక్కడ మాత్రం బాబు ఇచ్చే హామీలు, జగన్ సంక్షేమ పథకాలు అవేవీ పనిచేయవనే చర్చ సాగుతోంది.

బిజెపి 'అణు' చెలగాటం

యంత్ర లోపం వల్ల గానీ ఏ చిన్న ప్రమాదం సంభవించినా అణు ధార్మికతతో ఇటు కాకినాడ నుంచి అటు ఒడిశాలోని ఛత్రపూర్ వరకు సమస్త జీవకోటి సర్వనాశనం అయిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు వద్దంటున్న ప్రమాదకర అణుపార్కు ఏర్పాటుకు ఉవ్విళ్లూరుతున్న మోడీ ప్రభుత్వం, చట్టప్రకారం రాష్ట్రానికి ఇవ్వాల్సిన విభజన హామీలను మాత్రం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గుజరాత్‌లోని మితివిర్ధిలో అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించిన అణుపార్కును జిల్లాపై బలవంతంగా రద్దుతోందని విమర్శించారు.

ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. ప్రజల సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేటర్ సంపదగా బిజెపి మార్చేస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ విధానాలతో పరిశ్రమలు మూసివేయబడుతున్నాయని, కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేసి, గిరిజనుల భూములకు రక్షణ లేకుండా చేసిందన్నారు. కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేసిందని విమర్శించారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకపోగా... అంబానీ, అదానీలకు అప్పగిస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, ఉత్తరాంధ్రకి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి తీరని అన్యాయం, జిల్లాను నాశనం చేసే పరిశ్రమను ఏర్పాటు చేస్తున్న బిజెపిని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన పార్టీలను... తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, నాయకులు సిహెచ్.అమ్మన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రానున్న రెండు వారాలు కీలకం

నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పోలింగ్ శాతం పెరిగేలా, ఓటరు నిర్భయంగా వచ్చి ఓటు వేసేలా కృషి చేయాలని సూచించారు. అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులో జాగ్రత్త వహించాలన్నారు. ఒడిశా నుంచి మద్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగిన వారిని నియంత్రించాలని, ఇప్పటికే అలాంటి వారి జాబితాను ఆయా ఆర్‌ఒలకు పంపించినట్లు తెలిపారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి, సందీప్ కుమార్, పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, పోలీసు పరిశీలకులు సచింద్ర పటేల్, దిగంబర్ పి.ప్రదాన్‌కు ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఇప్పటికే సిబ్బందికి రెండు విడతల శిక్షణ పూర్తి చేశామని, మొదటి విడత ఇవిఎంల ర్యాండమైజేషన్ పూర్తయిందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, గిరిజన ప్రాంతంలో పోలింగ్ కోసం చేసిన ప్రత్యేక ఏర్పాట్ల గురించి తెలిపారు. ఓటింగ్ శాతం పెంచేందుకు కషి చేస్తున్నామని, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ రోజున 569 వాహనాలు సమకూర్చినట్లు వివరించారు.

520 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో పోలీసు బందోబస్తు, నిఘా బృందాలు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఎస్‌పి రాధిక వివరించారు. ఇప్పటివరకు రూ.4.32 కోట్ల విలువైన మద్యం, బంగారం, గంజాయి వంటివి సీజ్ చేశామన్నారు. 520 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఎన్నికల పరిశీలకులు సందీప్, పర్వేజ్ ఇక్బాల్ మాట్లాడుతూ ఓటర్ల స్లిప్పులను పూర్తి వివరాలతో శతశాతం పంపిణీ చేయడం ద్వారా, పోలింగ్ శాతం పెరుగుతుందని సూచించారు.

నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఇక ప్రచార కార్యక్రమాలు పెరుగుతాయని, అందువల్ల కోడ్ ఉల్లంఘనలపై దృష్టిసారించాలని సూచించారు. హోం ఓటింగ్‌లో ఓటరు రహస్యంగా ఓటు వేసే అవకాశాన్ని కల్పించాలన్నారు. కంపార్ట్‌మెంట్‌లో ఓటు వేస్తున్నప్పుడు వీడియో రికార్డింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. పోలీసు పరిశీలకులు సచింద్ర పటేల్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పోలింగ్ పర్సనల్స్ సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎఎస్‌పి ప్రేమ కాజల్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌ఒలు నూరుల్ కమర్, భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సిపిఒ ప్రసన్నలక్ష్మి, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పిస్తాం

పడిపోయిందన్నారు. రైతులకు రూ.వెయ్యి ప్రభుత్వం నుంచి అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందో చెప్పాలని మంత్రి అప్పలరాజును డిమాండ్ చేశారు. ఉద్దాన ప్రాంతంలో యువకుల కోసం డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిచనున్నట్లు చెప్పారు. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు అందిస్తామన్నారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు.

ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటి వద్దకే రూ.నాలుగు వేల పింఛను అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబు చౌదరి, కుత్తుం లక్ష్మణ్ కుమార్, ఎల్.కామేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

మామా అల్లుళ్లపై ఇసికి ఫిర్యాదు

పొందుపరిచారని చెప్పారు. ప్రస్తుత నామినేషన్ పత్రాల్లో ఆస్తుల వివరాలూ సక్రమంగా ఇవ్వలేదని చెప్పారు. ఆయన సతీమణి వాణిశ్రీ, తనయుడు చిరంజీవి నాగ్ డైరెక్టర్లుగా సుశ్రుత సంహిత సర్జికల్ సిస్టమ్స్ అండ్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, వాణిశ్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు మరో రెండు కంపెనీలను అఫిడవిట్‌లో పొందుపరచలేదని తెలిపారు. టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ గత ఎన్నికల్లో రూ.రెండు కోట్ల ఆస్తులు చూపి, ప్రస్తుత ఎన్నికల అఫిడవిట్‌లో రూ.ఏడు కోట్లు చూపించారని చెప్పారు. అతని విద్యార్హత బిఇ సివిల్‌పైనా అనుమానాలు ఉన్నాయని, త్వరలోనే వాటి నిజానిజాలను నిగ్గు తేలుస్తామన్నారు. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలతో జిల్లా ఎన్నికల అధికారికి, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని చెప్పారు. వారిద్దరి కుటుంబ ఆస్తుల వివరాలు, విద్యార్హతలపై న్యాయ పోరాటం చేస్తానన్నారు.

మామా అల్లుళ్లు ఒకరు అధికారంలో ఉంటే మరొకరికి సహకరించుకుంటూ వారు అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. 2015-19 మధ్య కాలంలో రవికుమార్ విప్‌గా ఉన్న సమయంలో తమ్మినేని సీతారాం డొల్ల కంపెనీలు పుట్టుకొచ్చాయని తెలిపారు. ఇద్దరు డైరెక్టర్లతో కంపెనీలు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి ఎన్నికలకు రెండు నెలల ముందు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడం పరిపాటిగా మారిందన్నారు. ఎన్నికల పూర్తయిన తర్వాత తెరచాటు ఒప్పందాలు చేసుకొని ఇద్దరూ లాభపడుతూ, ప్రజలకు పంగనామాలు పెడుతున్నారన్నారు. వీరిద్దరి అసలు స్వరూపం ప్రజల ముందు బయటపెడతానని చెప్పారు. ఈ రెండు కుటుంబాల అక్రమార్జనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

చంద్రబాబు హామీలను నమ్మడం లేదు

నీటిని తీసుకొచ్చేందుకు నిధులు విడుదల చేశారని చెప్పారు. రూ.700 కోట్లతో వంశధార నీటిని ఉద్దాన ప్రాంతానికి అందించారని కొనియాడారు. మూలపేట పోర్టుతో జిల్లా రూపురేఖలే మారబోతున్నాయన్నారు. మేనిఫెస్టోను మత గ్రంథాలుగా భావించి వాటిని అమలు చేసిన జగన్‌కు, ఇచ్చిన హామీలను అమలు చేయని చంద్రబాబుకు పోలికే లేదన్నారు. చంద్రబాబు ఎన్ని హామీలిచ్చినా అధికారంలోకొచ్చాక అమలు చేయరన్న విషయం 2014 ఎన్నికల్లోనే రుజువు అయిందన్నారు. దీంతో ఆయన ఇచ్చే హామీలనే ప్రజలు నమ్మడం లేదన్నారు. సమావేశంలో శ్రీశయన, తూర్పుకాపు కార్పొరేషన్ల చైర్మన్లు డి.పి దేవ్, ఎం.శ్రీకాంత్, వైసిపి నాయకులు ఎం.వి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P. 7/2024

Between: **Sunkana Suribabu**
...Petitioner

And:
1. Nakka Thavudu & 3 others
...Respondents

To,
R-1: Nakka Thavudu, S/o. N.Paparao, Hindu,aged 65, r/o Nakka Veedhi, Narasannapeta Village and Mandal, Srikakulam District- 532421. Aadhaar not known.
R-2: Patta Srinu, S/o. late Jagannadham, Hindu, aged 48, r/o Vatrammapeta Village, -rest do-, Cell No.9963275610.
R-3: Muddada Srinu, S/o. late Simayya, Hindu, aged 57, r/o. Sivanagar Colony, -rest do- Cell No. 9912041148, Aadhaar not known.
R-4: Tummidi Ranimma, W/o. late Tejeswara Rao, aged 54, Hindu, r/o Pasara Veedhi, -rest do- Cell No. 9121120902, Aadhaar not known.

పై నంబరు పిటిషనులో పిటిషనర్ తనను **Insolvent person** గా **Declare** చేయించుమని కోరుచు పైకోర్టులో **I.P.7/2024** నంబరుగా పిటిషన్ పై దాఖలు చేయగా, సదరు పిటిషన్‌లో పై **respondents** కు నోటీసు నిమిత్తం మరియు జనరల్ నోటీసు నిమిత్తం పై కోర్టు **తే 30-04-2024 దీ కి వాయిదా అయి వున్నది.** కావున ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్నయెడల **తే 30-04-2024 దీని పగలు 10-30 గంటలకు** పై కోర్టులో హాజరై వారికి గల ఆక్షేపణలు తెలియపరచుకో వలెను. లేనియెడల పిటిషనర్ తరుపున శ్రీ కోర్టు వారు ఆర్డరు జారీ చేయుదురని యీ బహిరంగ ప్రకటన మూలంగా జన యావన్మందికి తెలియ జేయడమైనది.

// బై కోర్టు ఆర్డర్//

CH. KHUSBU
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9908437485

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P. 2 / 2024

Between: **Tatapudi Mallesh**
...Petitioner

And: **Mondadu Samson and others**
...Respondents

To,
1). Mondadu Samson S/o M.M.Mark, aged 34 years residing at S.C. Street, Komanapalli Village, Jalumuru Mandal, Srikakulam District.
2). Palepu Laxmi Narayana S/o Suryanarayana, aged 35years, Residing at D.No. 14-1028N.K.Rajapuram Village, Palakonda Mandal, Srikakulam District.
3). Palepu Paravathi W/o Late Srinivasarao, aged 45years, Residing at D.No. 14-128, N.K.Rajapuram Village, Palakonda Mandal, Srikakulam District.
4). Boddepalli Apparao S/o Late Ramulu, aged 62 years, Residing at S.C. Street, Komanapalli Village, Jalumuru Mandal, Srikakulam District.
5). Palepu Laxmi W/o Late Suryanarayana, aged 62years, Residing at D.No. 14, N.K.Rajapuram Village, Palakonda Mandal, Srikakulam District.
6). Duvarapu Suresh S/o Kamalochanarao, aged 29 years,residing at S.C. Street, Komanapalli Village, Jalumuru Mandal, Srikakulam District.
7). Jonnada Gowaramma W/o Late Lakshamana, aged 58 years, Residing at D.No. 54, N.K.Rajapuram Village, Palakonda Mandal, Srikakulam District
8). Tatapudi Lakshmanarao S/o Late Suryanarayana, aged 33 years residing at S.C. Street, Komanapalli Village, Jalumuru Mandal, Srikakulam District.
9). Boddepalli Krishnamma W/o Apparao, aged 43 years, Residing at S.C. Street,N.K.Rajapuram Village, Palakonda Mandal, Srikakulam District.

పై పిటిషనర్ పై కోర్ట్ వారిని తనని దివాలాదారు ప్రకటించమని కోరుచూ పై కోర్ట్ లో పై నెంబరు I.P.2/2024 పిటిషన్ దాఖలు చేసుకుని ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియచేయునది ఏమనగా **తే.10-05-2024 దిన ఉదయం గం.10:30 ని॥** లకు మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారాగాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గలఅక్షేపణలు తెలియజేసుకొనగలరు, లేని యెడల సదరు I.P.2/2024 నెంబరు పిటిషన్ ను మీ పరోక్షమునందు పై కోర్టు వారు తీర్మానించగలరని ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

SRI U. NAGAMANIKUMAR
SRI. SAHINI ADITYA KIRAN
ADVOCATES, SRIKAKULAM.
CELL- 9440372477, 8520910888,

ఇంటింటా ప్రచారం చేస్తున్న గీత తదితరులు

'సూపర్ సిక్స్'పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు కలగనుందని జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత అన్నారు. శనివారం మండలంలోని చిట్టివలస, మాసెట్ పేట, కొత్తరోడ్డులో ఇంటింటా ప్రచారం చేపడుతూ సూపర్ సిక్స్ పోస్టర్లను పంపిణీ చేస్తూ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు జరిగిన తర్వాత సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. విజ్ఞులైన ఓటర్లు రాష్ట్ర భవిష్యత్‌ను ఆలోచించి ఉమ్మడి అభ్యర్థులైన కూన రవికుమార్, కింజరాపు రామ్మోహన్ నాయుడులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నూక రాజు, తమ్మినేని చంద్రశేఖర్, అన్నెపు భాస్కరరావు, బెండి రాము, హనుమంతు బాలకృష్ణ, గుజ్జల లక్ష్మణరావు, ఎండ అప్పల నాయుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత అన్నారు. పట్టణంలోని 8వ వార్డు పరిధిలో మేదర వీధి, కొత్త వీధి, గేటు తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీ, తెలుగు మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత, మాజీ కౌన్సిలర్లు బోర గోవిందరావు, విద్యాసాగర్, దవల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై టిడిపి కూటమి ఛార్జిషీట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గడచిన ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో వైఫల్యాలపై టిడిపి, జనసేన, బిజెపి కూటమి చార్జిషీటును విడుదల చేశారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు పిఎంజె బాబు, పిసిని చంద్రమోహన్, సురేష్ సింగ్, సింతు సుధాకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజె బాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంచుకున్న హత్యా రాజకీయాలను గత ఎన్నికల్లో ప్రజలు నమ్మారని, అదే విధానాన్ని ఐదేళ్ల పాటు కొనసాగిస్తూ ప్రజాధనాన్ని లూటీ చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. మరోవైపు విధ్వంసకర పాలన సాగిస్తూ వేలాది మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారన్నారు. ఈ విధానాలతో ప్రజలు విసిగి వేసారి పోయారన్నారు. ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం, దోపిడీ, చేపట్టిన అరాచకాలపై చార్జిషీటును విడుదల చేసినట్లు తెలిపారు.

ఛార్జిషీట్‌ను విడుదల చేస్తున్న కూటమి నాయకులు

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

బాధితునికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : పట్టణంలోని బాబాప్రెస్ వీధిలో ఉంటున్న తపన్ నాయక్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో వెన్నెముక దెబ్బతింది. దీంతో నడవలేక మంచాన పడ్డారు. కుటుంబ పోషణ కష్టంగా తయారు కావడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ ఆర్గనైజేషన్ తరఫున రూ.పది వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రాజు, రాజ్‌కుమార్, నరేంద్ర, కాశీ, ధనుష్, రంగ పాల్గొన్నారు.

చేరిన ఓటర్ల స్లిప్పులు

చేరిన ఓటరు స్లిప్పులు

నందిగాం : మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పలు గ్రామాల ఓటర్లకు అందించేందుకు వాటర్ స్లిప్పులు శనివారం మండల కేంద్రానికి చేరాయి వీటిని బూత్ లెవల్ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఓటర్లకు అందించనున్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న నరేంద్ర యాదవ్

నరేంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు

ఇచ్ఛాపురం: అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి, పిఏసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక క్రీడా మైదానంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 60 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్‌చైర్పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు పట్నాయక్, వార్డు కౌన్సిర్లు ప్రేమ్‌కుమార్, త్రినాథ్ పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

గిరిజన గ్రామాలు అభివృద్ధి

బూర్జ: మండలంలో అన్ని గిరిజన గ్రామాల రోడ్లు, తాగునీరు కోసం ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేశామని వైసిపి జిల్లా క్రీడల అధ్యక్షుడు చిరంజీవి నాగ్ అన్నారు. శనివారం తుడ్డలి పంచాయతీ పరిధిలో ఉన్న హరిపురం, పల్లాపురం గిరిజన గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అన్ని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతి ఒక్కరు వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, ఎంపిటిసి గుమ్మిడి రాంబాబు, వైస్ ఎంపిపిలు సూర్యారావు, కృష్ణం నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరిమళ, శ్రీదేవి

మరో అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలో మళ్లీ సిఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపిస్తేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే, విజయనగరం ఎంపీ అభ్యర్థుల సతీమణులు గొర్లె పరిమళ, బెల్లాన శ్రీదేవిలు కోరారు. శనివారం మండలంలోని గోవిందపురం, ఇజ్జాడపాలెం, బరిణికాలం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రహదారి ప్రక్కన ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పథకాలు వైసిపి ప్రభుత్వం వస్తేనే అందుతాయని, ఎన్‌డిఎ కూటమికి ఓటు వేస్తే చంద్రబాబు సిఎం అయితే పథకాలను, సంక్షేమాన్ని అటకెక్కించ చేస్తారన్నారు. ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్ కుమార్, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతం నాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, మాజీ ఎంపిటిసి శెటికం రాంబాబు, దేశెట్టి తిరుపతిరావు, పిల్లా రాము, కనకరాజు, కుమారి తదితరులు ఉన్నారు.

వైసిపి కార్యకర్తపై దాడి

గాయపడిన నరసింహులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ కూర్మనాథపురంలో వైసిపి కార్యకర్త బొమ్మాళి నరసింహులుపై గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు శనివారం దాడి చేసి గాయపరిచారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దువ్వాడ శ్రీనివాస్ ఆ గ్రామానికి మరికొద్ది సమయంలో చేరుకోవాల్సి ఉంది. ముందుగా వైసిపి కార్యకర్తలు నరసింహులు, దాసరి ఉమ కలిసి ప్రచారానికి రావాలని గ్రామస్తులను కోరారు. అక్కడే ఉన్న కోట సింహాచలం, కర్రి సాయి తమ గ్రామానికి వైసిపి అభివృద్ధి ఏమీ చేయలేదని, గ్రామానికి రావద్దని అడ్డగించారు. దీంతో నర సింహులు కలుగజేసుకుని ఎందుకు రాకూడదో చెప్పాలని ప్రశ్నించారు. దీంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. తోపులాట పెరిగిన క్రమంలో వైసిపి కార్యకర్త చొక్కా చిరిగింది. వాగ్వాదం ముదరడంతో నర సింహులును సింహాచలం పక్కనే ఉన్న కర్రతో కొట్టి గాయం చేశారు. సాయి చేతో దాడి చేశాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు.

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- కంచిలి

సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బందితో కలిసి అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు మండల పరిధిలోని కత్తివరం కూడలి వద్ద వద్ద వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. దుద్ది మధుబాబు, బీన ప్రేమ్ కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై బాగులో వంద మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారని తెలిపారు. విచారణ చేయగా ఆ మద్యానికి ఆంధ్రపురం ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించామన్నారు. అదే దుకాణంలో బీనా ప్రేమ్ కుమార్ సూపర్‌వైజర్‌గా, మధుబాబు కంచిలి ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. వారిద్దరినీ రిమాండ్‌కు తరలించి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, అప్పలరాజు భాను, నాయుడు పాల్గొన్నారు.

మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

దమయంతి మృతదేహం (ఇన్‌సెట్‌లో దమయంతి (ఫైల్))

వృద్ధురాలి హత్య

ఆలస్యంగా వెలుగులోకి...

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అమలపాడులో వృద్ధురాలు హత్యకు గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ హత్య ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మండలంలో చర్చనీయాంశమైంది. వృద్ధురాలు ఒంటిపై సుమారు పది తులాల బంగారం ఉండటంతో హత్యకు గురైందని అందరూ అనుమానిస్తున్నారు. పైగా మృతదేహం తన ఇంటికి సమీపంలో ఉన్న మూతబడిన డ్రెయినేజీలో కుళ్లి దుర్వాసన వస్తున్న స్థితిలో బయటపడటంతో అనుమానాలకు దారితీస్తుంది. హత్య చేసి డ్రెయినేజీలో కుక్కి ఉంటారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని అమలపాడుకు చెందిన దున్న ఎర్రన్న భార్య దున్న దమయంతి (60) ఈ నెల 24న ఇంట్లో టిఫిన్ చేసి తను నివసిస్తున్న ఇంటికి వెళ్లింది. 25న ఉదయం ఎప్పటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఎంత వెదికినా ఫలితం లేకపోయింది. శనివారం స్థానిక షిరిడీ సాయి ఆలయం ఎదురుగా ఉన్న డ్రెయినేజీ నుంచి దుర్వాసన వస్తుంది. దీనిని తాపీమేస్త్రీలు గుర్తించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సిహెచ్.రామారావు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. డ్రెయినేజీపై ఉన్న పలకలను తొలగించి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం దున్న దమయంతిది కావడంతో ఆమె కుమారులు కృష్ణారావు, రామారావు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలి కుమారుడు కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వేస్టేషన్ రోడ్డు, మార్కెట్ వెనుక శనివారం ఉదయం కాశీబుగ్గ పోలీసులు 45 ఏళ్ల వయసు ఉండే గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకటరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి మృతి చెందిన వ్యక్తి రైల్వేస్టేషన్ రోడ్డులో మద్యం తాగుతున్నట్లు ఈ ప్రాంతీయులకు తారాసపడ్డారని అన్నారు. రాత్రి సమయంలో ఆయన కిందపడి తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నామని అన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్లంఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని అచ్చాపురంలో టెక్కలి ఎన్‌ఫోర్స్‌మెంట్, పలాస డిటిఎఫ్ సిబ్బంది నాటుసారా తయారీ స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 70 లీటర్ల నాటు సారాను, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రాజశేఖర్‌నాయుడు పలాస డిటిఎఫ్ సిఐ పి.రామచంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డి శాంతి విస్తృత ప్రచారం

చంటి పిల్లాడిని ఎత్తుకుని ప్రచారం చేస్తున్న రెడ్డి శాంతి

ప్రజాశక్తి- కొత్తూరు

ఇంటింటికీ సిఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఓటర్లను కోరారు. మండలంలోని ఓంద్రుజోల, చింతమానుగూడ, కారిగూడ, శ్రీరాములుగూడ, బాంద్రాగూడ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి మేనిఫేస్టోను వివరించారు. జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని గుర్తు చేశారు. మళ్లీ సిఎం అయితే ఇప్పుడు ఇచ్చిన హామీలు కూడా తుచ తప్పకుండా అమలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఎస్.సావిత్రి, సర్పంచ్ సాధుబాబు, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, కలమట రమేష్, గోగుల వరప్రసాదరావు నాయుడు, జి.ఆనందరావు, బి.శ్రీను, ఎం.చక్రపాణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొండు శంకర్

ధర్మాన ఎత్తుగడలు ఫలించవు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజల విశ్వాసాన్ని ఐదేళ్లలో కోల్పోయిన మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈసారి ఎన్నికల్లో తిరిగి ప్రజలను మోసం చేసి నెగ్గేందుకు ప్రయత్నిస్తున్నారని, తాను మాత్రమే పదవిలో ఉండాలనుకునే స్వార్థబుద్ధి గల వ్యక్తి అని టిడిపి కూటమి అభ్యర్థి గొండు శంకర్ విమర్శించారు. పదేళ్లుగా నగరపాలక సంస్థలో ఎన్నికలు జరపకపోవడానికి కారణాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. శనివారం నగర పరిధిలో 48వ డివిజన్ ఫాజుల్ బాగ్ పేటలో సురకాసి వెంకటరావు ఆధ్వర్యాన ప్రజాగళం, బాబు సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ప్రజలు స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి ఆయనను పలకరించారు. నామినేషన్‌కు పెద్దసంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చిన జనాన్ని చూసి వైసిపి నాయకులు కుట్రలు, కుతంత్రాలకు తెర తీశారని, గొడవలు, అల్లర్లు సృష్టించేందుకు పన్నాగాలు పన్నుతున్నారని ఆరోపించారు. మైండ్ గేమ్ రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇప్పటికే మూడు నాలుగు బృందాలను నియోజకవర్గం నలుమూలలకు పంపారన్నారు. కుట్రలను ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా వున్నానని స్పష్టం చేసారు. టిడిపి అధికారంలోకి వచ్చిన అరునెలల్లో నగరపాక సంస్థకు పాలక వర్గాన్ని తీసుకొస్తానన్నారు. గడచిన ఐదేళ్లలో నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శిల్లా శ్రీనివాసరావు, మడ్డి అప్పలరాజు, ఆలపాన గోవిందరెడ్డి, తిప్పనా రామారావు, బచ్చు ఈశ్వర్ రెడ్డి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గాంధీ

ప్రజాశక్తి- పొందూరు

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనకు ఒక్క అవకాశం కల్పించాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. మండలం లోలుగులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తనకు ఒక్కచాన్స్ కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈయనతో పాటు మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సువ్వారి సువర్ణ, నాయకులు కోరుకొండ సాయికుమార్, పిన్నింటి అప్పలనాయుడు, పోతురాజు సూర్యారావు, చింతాడ శివ, ధర్మారావు పాల్గొన్నారు.

అశోక్ విస్తృత ప్రచారం

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం : టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని కేదారిపురం, ముచ్చింద్ర, బెనుగానిపేట గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం టిడిపి అభివృద్ధి చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నేతలు ఢిల్లీరావు, పద్మనాభం, సూర్యనారాయణరెడ్డి, బాలరాజు, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తమ్మినేని సీతారాం

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు రెండో శాసనసభ స్పీకర్‌గా ల్లాలో సీనియర్ ప్రజాప్రతినిధి తమ్మినేని సీతారాంకు అవకాశం లభించింది. 2019 జూన్ 13న ఆయన సభాపతిగా ఎన్నికయ్యారు. ఆముదాలవలస మండలం తొగరం గ్రామంలో జన్మించిన సీతారాం 1983, 85, 91 (ఉప ఎన్నిక), 94, 99లో ఐదు దఫాలుగా టిడిపి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2019లో వైసిపి తరుపున ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభ స్పీకర్ పగ్గాలు చేపట్టారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు నాయుడు హయాంలో కొన్ని శాఖల మంత్రిగా సేవలందించారు.

రొక్కం లక్ష్మీనరసింహ దొర (ఆర్.ఎల్.ఎన్ దొర)

1955లో ఆంధ్ర రాష్ట్రానికి మధ్యంతర ఎన్నికలు జరిగి ఆ ఏడాది మార్చి 30న కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన రొక్కం లక్ష్మీనరసింహ దొరకు శాసనసభ స్పీకర్‌గా అవకాశం లభించింది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం కురుడుకు చెందిన రొక్కం లక్ష్మీనరసింహ దొర వృత్తిరీత్యా న్యాయవాది. ఎపి న్యాయ కమిషన్ సభ్యునిగా, శ్రీకాకుళం జిల్లా బోర్డు తొలి అధ్యక్షునిగా కూడా ఆయన సేవలందించారు. బెజవాడ గోపాలకృష్ణారెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్పీకర్‌గా వ్యవహరించిన ఆర్.ఎల్.ఎన్ దొర తన చాకచక్యంతో సభను నడిపించి శభాష్ అనిపించుకున్నారు. మద్రాస్ ఆంధ్రా రెండో స్పీకర్ గానే కాకుండా చివరి స్పీకర్‌గా కూడా రొక్కం లక్ష్మీనరసింహ దొర చరిత్రలో నిలిచిపోయారు.

శాసనసభ స్పీకర్లుగా సిక్కోలు ప్రజాప్రతినిధులు

అధ్యక్షా...

అధ్యక్షా.. అనగానే మనకు ముందుగా శాసనసభ సమావేశాలే గుర్తుకువస్తాయి. శాసనసభ సక్రమంగా నిర్వహించాలన్నా, వాయిదా వేయాలన్నా, ముఖ్యమైన బిల్లులు ఆమోదం పొందాలన్నా, ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలు సభలో నిర్భయంగా చెప్పాలన్నా ఆ సభాపతి నిష్పక్షపాత నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది. అటువంటి ముఖ్యమైన పదవిని మన జిల్లా నుంచి ఎన్నికైన పలువురు శాసన సభ స్పీకర్లు దిగ్విజయంగా నిర్వర్తించి శభాష్ అనిపించుకున్నారు. శాసనసభాధిపతులుగా సేవలందించే అవకాశం జిల్లా ప్రజా ప్రతినిధులకు నాలుగుసార్లు వరించగా, అందులో మద్రాస్ ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు పర్యాయాలు, ప్రస్తుత ఎపిలో ఒకసారి అవకాశం లభించింది. చరిత్ర ఒకసారి పరిశీలిస్తే...

- ప్రజాశక్తి, కవిటి

తంగి సత్యనారాయణ

1983లో టిడిపి తరపున శ్రీకాకుళం నుంచి ఎన్నికైన తంగి సత్యనారాయణ శాసనసభ స్పీకర్ పదవిని అధిరోహించిన రెండో ప్రజాప్రతినిధి. శ్రీకాకుళం మండలం కిల్లిపాలెంలో జన్మించిన సత్యనారాయణ గార సమితి అధ్యక్షులుగా పనిచేశారు. ఆ తరువాత 1967లో స్వతంత్ర పార్టీ తరపున ఒకసారి, 1983లో టిడిపి తరపున రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983 జనవరి 18 నుంచి 1984 ఆగస్టు 28 వరకు శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన సత్యనారాయణ పలు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఎన్‌టిఆర్‌పై టిడిపిలో తొలిసారి తిరిగిపాటు జరగడం, నాదెండ్ల భాస్కరరావు నేతృత్వంలో ప్రజాస్వామ్య టిడిపి 1984 ఆగస్టులో అధికారం చేపట్టడం, ఆ తర్వాత రద్దు కావడం తదితర రాజకీయ సంక్షోభాలు, సంచలనాలకు ప్రత్యక్ష సాక్షిగా తంగి సత్యనారాయణ నిలిచారు. అటువంటి పరిస్థితుల్లో ముఖ్యంగా వార్తా పత్రికలు రాజకీయపరమైన, వ్యక్తిగతమైన రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించి, సభా కార్యక్రమాలను ప్రజలకు అందించాలని 1983 సెప్టెంబరు 19న స్పీకర్‌గా ఇచ్చిన రూలింగ్‌లో స్పష్టం చేశారు.

ఇప్పటివరకు గుంటూరు జిల్లా నుంచి అత్యధికంగా ఐదుగురు స్పీకర్ పదవిని నిర్వహించగా, ఆ తర్వాత స్థానం శ్రీకాకుళం జిల్లాకు దక్కింది. చిత్తూరు జిల్లా నుంచి ముగ్గురు, ప్రకాశం కరీంనగర్ జిల్లాల నుంచి ఇద్దరు, కృష్ణ, కర్నూలు, తూర్పుగోదావరి, మెదక్, నెల్లూరు, నిజామాబాదు నుంచి ఒక్కొక్కరు ఉమ్మడి శాసనసభ స్పీకర్లుగా వ్యవహరించారు.

ప్రతిభాభారతి

ఆంధ్రప్రదేశ్ 11వ శాసనసభకు 15వ శాసనసభ స్పీకర్ గానే కాకుండా తొలి మహిళ సభాధిపతిగా వ్యవహరించే అవకాశం కావలి ప్రతిభా భారతికి లభించింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో టిడిపి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రతిభాభారతి 1999 నవంబరు 11 నుంచి 2004 మే 30 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించారు. ఆమెది విజయనగరం జిల్లా సంతకవిటి మండలం కావలి. ప్రతిభాభారతి పలుమార్లు రాష్ట్ర మంత్రిగా కూడా సేవలందించారు. 2000 మే 29, 30, 31వ తేదీల్లో అఖిలభారత స్పీకర్ల సదస్సు ప్రతిభాభారతి హయాంలోనే జరిగింది. అంతేకాకుండా 2000 సెప్టెంబరు 13న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం జరిగిన చర్చల సమయంలో ఉదయం 8.30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు ఏకధాటిగా సభను నడిపించిన ఘనత ప్రతిభాభారతికి దక్కింది.

60 ఏళ్లలో ఏం అభివృద్ధి చేశారు?

మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- మందస

ఈ ప్రాంతంలో గౌతు కుటుంబం 60 ఏళ్లు పరిపాలించి ఏమి అభివృద్ధీ చేయలేదని, తాను ఒక్కసారి ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని కుంటికోట, కమలాపురం, అచ్చుతాపురం, వాసుదేవపురం, పిడి మందస, మధ్యదేవుపురం, నర్సింగపురం, ఛత్రపురం, జి.ఆర్.పురం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.700 కోట్ల వ్యయంతో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. కిడ్నీ రోగులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో రూ.50 కోట్ల వ్యయంతో కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టి ప్రారంభించామని చెప్పారు.

ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసి వృద్ధులకు ఇంటి వద్దకే ఒకటో తేదీన పింఛన్లు అందించామని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కారి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, చింతాడ గణపతి, కర్రి గోపాలకృష్ణ, దల్లి జానకిరెడ్డి, గేదెల పద్మనాభం పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రచారం చేస్తున్న అన్నాజీరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సనపల అన్నాజీరావు అన్నారు. శనివారం పురపాలక సంఘంలోని రెండో వార్డు కృష్ణాపురంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తోనే ప్రత్యేక హోదా సాధ్యమని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లఖినేని నారాయణరావు, సనపల రాజులు, బొత్స వెంకటరమణ, లఖినేని సునీల్ కుమార్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, సనపల వాసుదేవరావు, చింతాడ అప్పారావు, సనపల దిలీప్, అప్పారావు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- జలుమూరు

పేదల అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని యలమంచిలి, అక్కురాడ పంచాయతీల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమం ధర్మాన రామలింగం నాయుడు, ఎంపిపి వాన గోపి, మాజీ ఎంపిపి బగ్గు రామకృష్ణ, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కనుసు సీతారాం, పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామలరావు, సర్పంచ్‌లు మెండ రవికుమార్, చంచల జోగారావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న కృష్ణదాస్

నరసన్నపేట : పట్టణంలోని హట్కో కాలనీ, మెయిన్ రోడ్డులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ కోడళ్లు శ్రావణి, గ్రీష్మలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

టెక్కలిలో మహిళా ఓటర్లే అధికం

టెక్కలి : టెక్కలి నియోజకవర్గంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లే ఆధికం. టెక్కలి నియోజకవర్గ పరిధి టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలు ఉన్నారు. 315 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 1,17,780 మంది పురుష ఓటర్లు ఉండగా, 1,18, 452 మంది స్త్రీ ఓటర్లు ఉన్నారు. 9 మంది ట్రాన్స్ జెండర్లు ఉండగా, మెత్తం కలిపి 2,36,241 మంది ఓటర్లు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. నందిగాం మండలంలో 88 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీరిలో 25,174 మంది పురుష ఓటర్లు ఉండగా, 25,105 మంది స్త్రీ ఓటర్లు ఉన్నారు. నలుగురు ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. సంతబొమ్మాళి మండలంలో 73 పోలింగ్ స్టేషన్లకు గాను, 30,157 మంది పురుష ఓటర్లు ఉండగా, 29,922 స్త్రీ ఓటర్లు ఉన్నారు. ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. కోటబొమ్మాళి మండలంలో 78 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 31,351 మంది పురుష ఓటర్లు ఉన్నారు. 31,287 మంది స్త్రీ ఓటర్లు ఉన్నారు. ఒకరు ట్రాన్స్ జెండర్ ఉన్నారు. టెక్కలి మండలంలో 76 పోలింగ్ స్టేషన్లకు గాను, 31,098 మంది పురుష ఓటర్లు ఉండగా, 32,138 మంది స్త్రీ ఓటర్లు ఉన్నారు. ఇద్దరు ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నారు. కాగా, పురుష ఓటర్లు కంటే 272 మంది స్త్రీ ఓటర్లు అధికంగా ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి

బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతికి దోహదపడే సంక్షేమం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డిసిసి అధ్యక్షులు, ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు అన్నారు. మండలంలోని పాతనౌపడ, పెద్దరోకళ్లపల్లి, సంతబొమ్మాళి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. రోజంతా శ్రమిస్తున్న వస్తున్న కూలీ తమ నిత్యావసర వస్తువుల కొనుగోళ్లకే సరిపోవడం లేదని కూలీలు ఆయన వద్ద వాపోయారు. అనంతరం అభ్యర్థి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధికారంలోకి వస్తే చట్టాన్ని సరళీకరణ చేసి రోజుకు రూ.400 ఇస్తుందని మేనిఫేస్టోలో పెట్టిందని వివరించారు. ఈయనతో పాటు విశ్వేశ్వరరావు, పేడాడ సూర్యనారాయణ ఉన్నారు.

సంక్షేమ పాలనకు తోడ్పాటు అందించండి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ముఖ్యమంత్రి జగన్‌ను మరో సారి ఆదరించి సంక్షేమ పాలనకు తోడ్పాటును అందించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రజలను కోరారు. శనివారం మండలంలోని మతలబుపేట, పురపాలక సంఘ పరిధిలోని 20 వార్డు వెంగళరావు కాలనీలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు 15 ఏళ్ల పాలనలో శాశ్వత అభివృద్ధి పథకం ఒక్కటైనా ఉందా అని ప్రజలను ప్రశ్నించారు. ప్రజలకు మంచి జరిగి ఉంటే పార్టీకి, ప్రభుత్వానికి అండగా నిలిచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపిలు శివానంద బాబు, లావేటి అనిల్ కుమార్, బుడుమూరు శ్రీనివాసరావు, చింతు విజయ, సత్యనారాయణ, బొడ్డేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్ రోడ్‌షోకు స్పందన

రోడ్‌షోలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి శంఖారావం కార్యక్రమంలో భాగంగా శనివారం టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ నిర్వహించిన రోడ్డుషోకు అపూర్వ స్పందన లభించింది. మండలంలోని కేశవదాసుపురం, భగవానుదాసుపేట, నరసాపురం, నందివాడ, వావిలపల్లిపేట, ఇల్లయ్యగారిపేట, ధర్మపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన అవసరం మనందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, కార్యదర్శి వండాన మురళీ, టిఎన్‌టియూసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణ రావు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, వి.ఆర్ఎల్ నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో ఐదేళ్లుగా అభద్రతాభావం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపి పాలనలో ఉద్యోగులకు కూడా భవిష్యత్‌పై భరోసా లేకుండా పోయిందని కూటమి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు సతీమణి శ్రీశ్రావ్య పేర్కొన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో సింతు సుధాకర్, బి.సంతోష్, ముద్దాడ ధనలక్ష్మి, రామకృష్ణల ఆధ్వర్యాన శనివారం ప్రజాగళం, బాబు సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ మరదలు డాక్టర్ సి.హెచ్. అనితతో కలసి శ్రీశ్రావ్య పాల్గొన్నారు. కాలనీలో విస్తృతంగా పర్యటించి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి నిరంకుశ విధానాలతో అన్నివర్గాల ప్రజల తీవ్ర వ్యతిరేకతను కూడగట్టుకున్నాయన్నారు. ఉద్యోగులకు సమయానికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, యువతకు ఉపాధి కల్పించలేక పోయిందన్నారు. ఈ పరిస్థితులు మారాలంటే ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ఎంపీ సతీమణి శ్రీశ్రావ్య, డాక్టర్ అనిత

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష

ప్రజాశక్తి- ఎచ్చెర్ల
పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు ప్రభుత్వ శనివారం నిర్వహించిన ఏపి పాలీసెట్ 2024 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 38 కేంద్రాల్లో జరిగిన ఈపరీక్ష శ్రీకాకుళం, టెక్కలి డివిజన్ కేంద్రాలుగా నిర్వహించారు. శ్రీకాకుళం డివిజన్‌లో 26 కేంద్రాల్లో 7195 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 6,492 మంది, టెక్కలి డివిజన్‌లో 12 కేంద్రాల్లో 4,820 మందికిగాను 4,366 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 38 కేంద్రాల్లో 12015 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,858 మంది విద్యార్థులు హాజరై 90.37 హాజరుశాతం నమోదు చేశారు. ఈ పరీక్షను జిల్లా సమన్వయకర్తలు గురువుబెల్లి దామోదరరావు, ఎ. గోపాలం పర్యవేక్షించారు.

టెక్కలి: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం నిమిత్తం నిర్వహించబోయే పాలిసెట్ ప్రవేశపరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని 16 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,816 మంది హాజరు కావాల్సి ఉండగా, 4,362 మాత్రమే హాజరయ్యారు. 454 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్ పర్యవేక్షించారు. పరీక్ష నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు చీఫ్ సూపరింటెండెంట్ రోణంకి శ్రీనివాసరావు, పరిశీలకులు పి.లోకేష్, పి.బెనర్జీ ఉన్నారు.

పరీక్షలను పరిశీలిస్తున్న విలియమ్స్

రూ.1.21 లక్షలు పట్టివేత

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం
ఇచ్ఛా పురం మండలంలోని ఎ.ఎస్ పేట వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.1.21 లక్షల నగదు పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం జయంతి పురానికి చెందిన సురేష్‌కుమార్ సాహు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ద్విచక్ర వాహనంపై ఒడిశా నుంచి ఇచ్ఛాపురం వస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేయగా, ఆయన వాహనం డిక్కీలో రూ.1.21 లక్షల నగదును లభించింది. ఆ మొత్తానికి సంబంధించిన ఎటువంటి రశీదులు, ఆధారాలు చూపకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్ఛాపురం పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - గార
మండలంలోని అంపోలు, శ్రీకూర్మం, కె.మత్స్య లేశంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక శని వారం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, భౌగోళిక పరిస్థితులు, రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కేంద్రాల వద్ద భద్రతాపరమైన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట శ్రీకాకుళం రూరల్ సిఐ సన్యాసి నాయుడు, గార ఎస్ఐ ఉన్నారు.

నేడు నియామక పత్రాలు జారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్
సాధారణ ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలోని శ్రీకాకుళం రూరల్, అర్బన్, గార మండలాల్లో ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఆదివారం నియామక పత్రాలను ఈనెల 28న జారీ చేయనున్నట్లు రిటర్నింగ్ అధికారి, శ్రీకాకుళం ఆర్‌డిఒ సి.హెచ్.రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండే పిఒ, ఎపిఒ, ఒపిఒ, మైక్రో అబ్జర్వర్లకు సంబంధించి కేటాయించిన నియోజకవర్గం పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆయా తహశీల్దార్ కార్యాలయాల్లో ఆర్డర్ కాపీలను తీసుకోవాలని సూచించారు.

మేనిఫెస్టో జనరంజకం : వైసిపి

ప్రజాశక్తి - నరసన్నపేట
వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో జనరంజకంగా ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను 99 శాతం పూర్తి చేశారని తెలిపారు. ఈ మేనిఫెస్టోలో మరింత రెట్టింపుగా నిధులు కేటాయిస్తూ అమలు చేస్తారనే ఆశాభావం రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ ఉందన్నారు. ప్రజల సంక్షేమంపై జగనన్నకు చెక్కుచెదరని ప్రేమ ఉందని, దీంతో అది మరింత రెట్టింపు అయిందని రుజువవుతోందని తెలిపారు.

ఇదేనా పారిశుధ్యం...?

ప్రజాశక్తి- పలాస
జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటి. ఆర్థికంగా వ్యాపారం లావాదేవీలు పెరుగుతుండటంతో మున్సిపాలిటీకు ఆదాయం రోజురోజుకు పెరుగుతూ వస్తుంది. కానీ, పారిశుధ్యం మెరుగులో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అధ్వానంగా దర్శనమిస్తుంది. అపారిశుధ్యం విలయతాండవం చేస్తోంది. పట్టణంలో ఏ వీధికి వెళ్లినా చెత్తాచెదారాలతో నిండిపోయింది. మురుగు కాలువలు చెత్తతో పేరుకుపోయి దర్శనమిస్తాయి. దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషజ్వరాలు ప్రబలి ప్రజలు ఆస్పత్రుల్లో చేరే పరిస్థితి కనిపిస్తుంది. మున్సిపల్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలాస ఎలక్ట్రికల్ కార్యాలయం వద్ద కాలువ, కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వద్ద కాలువలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో మురికినీరు అక్కడక్కడే నిలిచిపోతుంది. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లిన ప్రతి ఒక్కరూ దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కాశీబుగ్గ శ్రీనివాస్ నగర్‌లో రోడ్డు మధ్య చెత్త చెదారం పేరుకుపోవడంతో అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలాస అన్నపూర్ణ థియేటర్ సమీపం వినాయక ఆలయం నుంచి వెళ్లే రోడ్డులోని కాలువలో తొలగించిన చెత్తా చెదారం, కాశీబుగ్గ పెట్రోల్ బంక్, ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో కాలువలో తొలగించిన చెత్తా చెదారాలను అలాగే విడిచి పెట్టారు. దీంతో అటుగా వెళ్తున్న ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు చొరవ చూపి పారిశుధ్యం మెరుగు పరచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్తా చెదారం

శ్రీనివాసరావుకు కండువా వేస్తున్న సుబ్బారెడ్డి

వైసిపిలోకి స్వతంత్ర అభ్యర్థి

ప్రజాశక్తి- రణస్థలం
అనకాపల్లిలో రాజ్యసభ సభ్యులు, రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి కార్యాలయంలో ఇటీవల వైసిపిని వీడి ఎచ్చెర్ల నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పైడి శ్రీనివాసరావు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాజ్యసభ సభ్యులు, రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి సమక్షంలో తిరిగి వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా పైడి శ్రీనువాసరావు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై అభిమానంతో తిరిగి పార్టీలోనికి రావడం జరిగిందని, ఎచ్చెర్ల నియోజకవర్గంలో గొర్లె కిరణ్ కుమార్ గెలుపునకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న స్వాతి

టిడిపిలో చేరిన ఉప సర్పంచ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
గార మండలం కళింగపట్నం ఉప సర్పంచ్ మందుల అన్నాజీరావుతో పాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి సమక్షంలో టిడిపిలో చేరారు. శనివారం పొట్నూరు కృష్ణమూర్తి ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో ఆమె టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల్లో వారికి కూడా ప్రాధాన్యం కల్పించారన్నారు. కూటమి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌లను గెలిపించాలని ఆమె కోరారు.

టిడిపిలోకి నరసన్నపేట ఉప సర్పంచ్

ప్రజాశక్తి- నరసన్నపేట
నరసన్నపేట మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్, వైసిపి కీలక నేత సాసుపల్లి కృష్ణబాబు పార్టీ సభ్యత్వానికి, ఉప సర్పంచ్ పదవికి శనివారం రాజీనామా చేశారు. అనంతరం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి రమణమూర్తితోనే సాధ్యమన్నారు. మూడున్నరేళ్లుగా పట్టణంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ భూములు కబ్జాలు, దౌర్జన్యాలు దోపిడీలకు అడ్డాగా పంచాయతీ మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్, జెడ్‌పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్, పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి జి.చిట్టిబాబు, లీగల్ సెల్ కార్యదర్శి రోణంకి కృష్ణంనాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టిడిపి కండువా వేస్తున్న రమణమూర్తి

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
ప్రతి ఓటరూ తన ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ ఎం.సురేష్ సూచించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన మహాదేవిపురం పోలింగ్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి అవగాహన కల్పించారు. ఓటు వజ్రాయుధమని, దాన్ని సరైనవిధంగా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పవిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ సురేష్

ప్రారంభిస్తున్న కామేష్

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- పాతపట్నం
పాతపట్నం మండలంలోని తెంబూరు వై కూడలి వద్ద సత్య సాయి భజన మండలి ఆధ్వర్యాన శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. భజన మండలి కన్వీనర్ అంధవరపు కామేష్ ప్రారంభించి మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేశారు. వై కూడలి వద్ద వచ్చిపోయే ప్రయాణికులకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతి

ప్రజాశక్తి- రణస్థలం
రణస్థలం మండల కేంద్రంలో ఉన్న శ్రీవెంకటేశ్వర హైస్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ నక్కిన వెంకటరమణ (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. రణస్థలం మండల కేంద్రంలో 20 ఏళ్ల క్రితం రణస్థలం మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు హైస్కూల్ స్థాపించారు. వెంకటరమణ డిజిఎం ఆనందరావుకు స్వయాన బావ కావడంతో ఉన్నత చదువులు చదువుకున్న వెంకటరమణను ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఆయన కృషితో హైస్కూల్‌ని అభివృద్ధి చేసి వేల మంది విద్యార్థులకు ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించి, మంచి విద్యావంతులుగా తీర్చిదిద్ది, ఉన్నత స్థానంలో నిలబెట్టి ఎంతో మందితో మన్ననలు పొందారు. ఆయన మృతికి ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు సంతాపం తెలిపారు.

వెంకటరమణ (ఫైల్)

మాట్లాడుతున్న త్రినాథ్‌బాబు

షర్మిల సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఈ నెల 28న టెక్కలిలో నిర్వహించనున్న పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల ప్రచార సభను విజయవంతం చేయాలని ఇండియా కూటమి అభ్యర్థి మజ్జి త్రినాథబాబు, డాక్టర్ జీవితేశ్వరరావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. ఇప్పుడున్న వైసిపి, గతంలో పాలించిన టిడిపి విభజన హామీలను తుంగలోనికి తొక్కి మోడీకి మోకరిల్లి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఎక్కడ చూసినా కబ్జాలు, సెటిల్‌మెంట్లతో రాష్ట్రం నాశనమైందన్నారు. అందుకు కాంగ్రెస్ పార్టీ మళ్లీ రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని అన్నారు. ప్రచారాలకు ఎక్కడకు వెళ్లినా అనూహ్య స్పందన లభిస్తుందన్నారు.

ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

దువ్వాడను గెలిపించాలి

ప్రజాశక్తి- నందిగాం

లటెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లను గెలిపించాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి ఓటర్లను కోరారు. ఈ మేరకు మండలంలోని రథజనబొడ్డపాడు, సవరనీలాపురం, బెల్లుకోల, భైరిబొడ్డపాడు, పద్మానపురం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఫాల్గుణరావు, జెసిఎస్ కన్వీనర్ జె.జయరాం, రెగల కూర్మారావు, బి.బాలకృష్ణ, శైలాడ లావన్న, సర్పంచ్‌లు బొడ్డపాటి తిరుపతిరావు, పోలాకి మోహనరావు, కణితి నారాయణమూర్తి, తిరిమి దేవేంద్రరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సత్యనారాయణ

పాతపట్నం : పాతపట్నం బార్ అసోసియేషన్‌లో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా బి.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా వై.చంద్రభూషణ రావు, కార్యదర్శిగా జి.రామ్మోహన రావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.రమణ, కోశాధికారిగా యు.దాలయ్య, గ్రంథాలయ కార్యదర్శిగా బి.వి.నాయుడు, సాంస్కృతిక కార్యదర్శిగా సిహెచ్.రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

సత్యనారాయణ

ఒక్కపూటే పని చేయించాలి

ప్రజాశక్తి- హిరమండలం

ఉపాధి హామీ పనిలో రెండు పూటలా పని రద్దు చేసి ఒక్క పూట పని పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని నౌగూడ వద్ద చేపడుతున్న ఉపాధి హామీ కూలీలతో శనివారం మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని, తాగునీటికి రూ.పది, గుణపాముకు రూ.50, తట్టకు రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రెండు పూటలూ మండుటెండలో పనిచేసినా రూ.300 చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. కోట్లాది మందికి అన్నంపెట్టే ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతందన్నారు. కనీస కూలి రూ.600 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జి.మహాలక్ష్మి, టి.అరుణ, జి.ఢిల్లీశ్వరి, జి.సుజాత, వి.సరస్వతి, కె.స్వాతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింహాచలం

వైసిపిని ఓడించేందుకు సిద్ధం

ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, వైసిపి అభ్యర్థులను ఓడించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఆయన నివాసం వద్ద శనివారం విలేకరులతో మాట్లాడారు. కోడి కత్తి కేసుతో అధికారంలోకి వచ్చి, గొడ్డలి కేసుతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సిఎం గులక రాళ్లతో తేరుకోవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి చరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రజలు ఉన్నారని అన్నారు. మద్యపాన నిషేధమంటూ అధికారంలోకి వచ్చి నాసిరకం మద్యం విక్రయించి 35 లక్షలకు పైగా జనాభా ఆస్పత్రుల పాలు చేశారని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉచితంగా లభించే ఇసుక నేడు వేలకు వేలు కుమ్మరిస్తున్నా దొరకని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వైసిపి నాయకులు ఎక్కడకక్కడ ఇసుకాసురులుగా మారి ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని విమర్శించారు. నవరత్నాల పేరుతో ప్రజలకు తలంటి నవనాడులూ కదిలిపోయేలా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. చివరికి పంచాయతీల నిధులూ పక్కదారి పట్టించిన ఘనత జగన్‌దేని ఆరోపించారు. చివరికి నెలంతా పనిచేసే ఉద్యోగులు తమ జీతం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసే పరిస్థితికి ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.

వైసిపితోనే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలన రావాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. మండలంలోని ముచ్చింద్ర పంచాయతీ శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, సర్పంచ్ ప్రతినిధి శాడి గురుమూర్తి, సల్ల దేవరాజ్, కారంగి మోహనరావు, కాళ్ల మనోజ్, పల్లంటి మధుమూర్తి పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న విజయ

ప్రచారం చేస్తున్న నీలోత్పల

అశోక్ సతీమణి ప్రచారం

ప్రజాశక్తి- కవిటి

నిత్యం ప్రజలతో ఉంటూ, ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే భార్య నీలోత్పల కోరారు. మండలంలోని సూరిపుట్టుగ, చిన్నఎర్ర గోవింద పుట్టుగ, పెద్ద ఎర్రగోవిందపుట్టుగ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. గత నలభై ఏళ్లుగా తమ కుటుంబం ప్రజలతో మమేకమై ఉందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే చంద్రబాబు మార్గదర్శనం అవసరమని అన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మిక చట్టాలను కాపాడుకుందాం

ప్రజాశక్తి- పలాస

కార్మిక చట్టాలను కాపాడుకుందామని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుచ్చ దుర్యోధన, దేవాడ నారాయణమూర్తి అన్నారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యాన మండలంలోని బొడ్డపాడులో అమరుల స్మారక మందిరంలో 138వ మే డే పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేళ్లుగా ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ప్రభుత్వ సంస్థలను అప్పన్నంగా పెట్టుబడిదారులకు అప్పగిస్తుందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, కార్పొరేట్లకు అనుకూలంగా 4 లేబర్ కోడ్లు బిల్లు తెచ్చి కార్మికులుకు తీవ్రమైన అన్యాయం చేశారని అన్నారు. బొగ్గు, గనులు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు ప్రయివేటీకరణతో కోట్లాది ఉద్యోగాలు పోయాయని అన్నారు. మరోపక్క అంబేద్కర్ రాసిన రాజ్యాంగపై దాడి చేస్తూ... మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయడానికి ఆర్‌ఎస్ఎస్, విశ్వ హిందు పరిషత్, భజరంగ్ ధల్ వంటి సంస్థలు పనిచేస్తున్నాయని అన్నారు. దేశంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టేందుకు ఈ దేశ మూల పురుషులైనా ఆదివాసీలను అడవి నుంచి గెంటివేయడానికి ఆపరేషన్ కగార్ పేరుతో మానవ హనన్నా హత్యలను అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య సభ్యులు కారి పురుషోత్తం, దాసరి శ్రీరాములు, తామడ త్రిలోచన, బొడ్డు సింహాద్రి, మద్దిల ధర్మారావు, గూడా మన్మథ, తామడ రామారావు, రాము, వాసు, కూర్మారావు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర కల్పించాలని వినతి

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో జీవనాధారమైన జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ కోరారు. మండలంలోని మాకన్నపల్లి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ కలిసి జీడి సమస్యలపై వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి పంటపై తెలుగు దేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి రైతులకు అండగా ఉండాలని కోరారు. జాతీయ పంటల జాబితాలో జీడి పంటను చేర్చాలని, పార్లమెంటులో జీడి సమస్యలపై ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వంతో ఒప్పించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో పండిన జీడి పిక్కలను ముందుగా కొనుగోలు చేసిన తర్వాతే... విదేశీ పిక్కలను దిగుమతి చేయాలన్నారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి జీడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సమావేశమైన మత్స్యకారులు

టిడిపికే మద్దతు ఇస్తాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మత్స్యకారుల మద్దతు టిడిపికే ఉంటుందని మండల మత్స్యకార నాయకులు తెలిపారు. మండలంలోని దేవునల్తాడ, కొత్తపేట పంచాయతీల్లో శనివారం మత్స్యకార కుటుంబాలు సమావేశం నిర్వహించారు. ఈ మేరకు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషకే మా మద్దతు అంటూ తీర్మానించారు. టిడిపి హయంలోనే మత్స్యకార కుటుంబాల్లో వెలుగులు విరజిమ్మేవని, మళ్లీ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, జి.పాపారావు, తలే అప్పోజీ, కృష్ణ, కె.రామన్న, పాపారావు, రామారావు, రాంబాబు, సాయి పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు ఇంటింటా ప్రచారం

నందిగాం : ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు మండలంలోని అన్నాపురం, తోటూరు, కల్లాడ, కొత్తూరుసవరరాంపురం, దీనబంధుపురం, మలాపురం, దిమ్మడిజోల గ్రామాల్లో శనివారం ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అజయ్‌కుమార్, ఎ.రవిప్రసాద్, ఎస్.కృష్ణారావు, తిరుమలరావు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు అమీన్ సాహెబ్‌పేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాలీనా మామయ్య, టిడిపి మాజీ కౌన్సిలర్ సాలీనా రేవతితో పాటు 50 కుటుంబాలు వైసిపిలో చేరారు. వీరికి అమీన్‌సాహెబ్‌పేటలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు, గడప గడపకు అందిస్తున్న పాలనా నచ్చి పార్టీలో చేరినట్లు మామయ్య యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, ప్రకాశరావు పట్నాయక్, సాలీన ఢిల్లీ, నరేంద్ర యాదవ్, చాట్ల తులసీదాస్‌రెడ్డి, పిలక సంతోష్‌రెడ్డి, ప్రతి అన్వేష్, కోటి, గుజ్జు తారకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి కండువా వేస్తున్న సాయిరాజ్

నారాయణపురం ఆధునికీకరణ పనులకు గ్రహణం

- అర్థాంతరంగా నిలిచిన పనులు
- పట్టించుకోని ప్రభుత్వాలు
- ఆందోళనలో రైతులు

నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ పనులకు గ్రహణం పట్టింది. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి పనులు పూర్తవుతాయని, తమకు పుష్కలంగా సాగునీరు అందుతుందని కలలుగన్న రైతన్నలకు నిరాశే ఎదురవుతుంది.

ప్రజాశక్తి- బూర్జ

రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2017లో ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు

తుప్పల్లో ఉన్న షట్టర్లు

నారాయణపురం ఆనకట్ట

జపాన్ ప్రభుత్వం రూ.112 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో తెలుగుదేశం ప్రభుత్వం ఆనకట్టుకు సంబంధించి కొత్త సెంట్రల్ వేసేందుకు సైడ్‌వాల్స్ నిర్మించేందుకు, అలాగే కుడి, ఎడమ కాలువలను 50 కిలోమీటర్ల వరకు పనులను ప్రారంభించింది. ఈ ఆధునికరణ పనులు పూర్తయితే నాగావళి నది నుంచి నారాయణపురం ఆనకట్ట ద్వారా కుడి, ఎడమ కాలువల వలన జిల్లాలోని ఏడు మండలాలకు, 67 గ్రామాలకు సుమారు 37 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పనులను ప్రారంభించింది. అయితే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బూర్జ, ఎచ్చెర్ల తదితర మండలాల్లో ఆధునికీకరణ పనులు 40 శాతం వరకు పూర్తయ్యాయని అనంతరం వాటిని అర్థాంతరంగా విడిచి పెట్టారని ఆయా మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం వైసిపి ప్రభుత్వ హాయంలో ఆధునికీకరణ పనులు పూర్తవుతాయని, తమ సాగునీటి కష్టాలు తీరుతాయని ఎదురు చూసిన రైతులకు ఈసారి కూడా నిరాశే ఎదురైంది. ప్రతి ఏడాది పనులు పూర్తి చేస్తామని హామీలు గుప్పించిన ప్రభుత్వం చిట్టచివరకు వాటిని అలాగే వదిలేయడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదని రైతులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్థాంతరంగా నిలిచిన ఆధునీకరణ పనులను చేపట్టి పుష్కలంగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

టిడిపిలో చేరిన వారితో రవికుమార్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో పలు గ్రామాల్లో టిడిపిలోకి చేరికలు కొనసాగుతున్నాయి. మండలంలోని లక్ష్మీపేట, పొందూరుకు చెందిన పలు కుటుంబాలు శుక్రవారం టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. లక్ష్మీపేట గ్రామానికి చెందిన సుమారు 60 కుటుంబాలు, పొందూరు పట్టణానికి చెందిన 20 రజక కుటుంబాలకు చెందిన వారికి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మొకర తవిటినాయుడు, మొకర అప్పల నాయుడు, కోరాడ వెంకటరావు, కర్రి కుమార్, శివ్వాల సాయి, శ్రీరంగ నాయకులు, మొకర సురేష్‌లకు చెందిన కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఎంపిటిసి అనకాపల్లి వాణి, ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, తెలుగు యువత జిల్లా కార్యదర్శి శంకర భాస్కరరావు, ఎంఎస్ఎన్, బాల పాల్గొన్నారు.

హెల్ప్‌డెస్క్ సిబ్బందితో ప్రిన్సిపాల్ ఉదయలక్ష్మి

డిగ్రీ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా చేరబోవు విద్యార్థులకు అవసరమైన సమాచారం కోసం హెల్ప్‌డెస్క్‌ను శనివారం ప్రిన్సిపాల్ డా.సి.హెచ్ ఉదయలక్ష్మి ప్రారంభించారు. కళాశాలలో విద్యార్థులను చేర్చేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల ఇంటికి టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది వెళ్లి డిగ్రీలో గల కోర్సులపై అవగాహన కల్పించి వారిని చేర్చుతున్నట్లు పేర్కొన్నారు.

జ్ఞాపికను స్వీకరిస్తున్న సందీప్‌కుమార్

అరసవల్లి సందర్శించిన సందీప్ కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల పర్యవేక్షణ విధుల్లో ఉన్న పరిశీలకులు సందీప్ కుమార్ శనివారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి ఎస్ చక్రవర్తి అందజేశారు. ఆయనతో పాటు నెహ్రూ యువక కేంద్రం కో-ఆర్డినేటరు వెంకట్ ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

2న రణస్థలం మండల సమావేశం

రణస్థలం: రణస్థలం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మే 2న ఉదయం 11 గంటలకు ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

వైసిపికి వరం కుటుంబసభ్యుల రాజీనామా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వలన అన్నివర్గాల ప్రజలకు లబ్ది చేకూరుతుందని కీ.శే మున్సిపల్ మాజీ చైర్మన్ అంధవరపు వరహా నరసింహం(వరం) కుమార్తె, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ పైడిశెట్టి జయంతి, ఆమె సోదరులు అంధవరపు ప్రసాద్, అంధవరపు సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమం, అభివృద్ధి సమపాలలో జరుగుతుందని విశ్వసిస్తూ టిడిపిలో చేరనున్నట్టు ప్రకటించారు. 2000-2005 శ్రీకాకుళం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఐదేళ్ల విజయవంతంగా పనిచేయడానికి చంద్రబాబు, దివంగత మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రంనాయుడు తమకు అవకాశం కల్పించి గౌరవించారని తెలిపారు. ఈనెల 28న

వరం వారసులు

ఉదయం 8 గంటలకు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సమక్షంలో టిడిపిలో చేరాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. వరం అనుచరులు, ఆప్తులు తమ కుటుంబానికి సన్నిహితులు, తాము తీసుకున్న నిర్ణయానికి స్వాగతిస్తారని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

దాహార్తిని తీర్చే బాధ్యత అందరిదీ...

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండు వేసవిలో దాహార్తిని తీర్చే బాధ్యత మానవతావాదులు అందరిపై ఉందని శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో స్టార్ వాకర్స్ చురుకైన పాత్ర పోషిస్తున్నారన్నారు. వేసవిలో నగరానికి అనేక అవసరాల రీత్యా వచ్చి వెళ్లే వారు ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని,

మజ్జిగ పంపిణీ చేస్తున్న సురేఖ

అటువంటి వారికి దాహార్తి తీర్చాల్సిన బాధ్యత నగరవాసులపై ఉందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల : డా.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో అనుబంధ డిగ్రీ కళాశాలలో 2017, 2018, 2019 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు సంబంధించిన మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను యూనివర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్ భాస్కర్ శనివారం విడుదల చేశారు. బిఎ, బిఎస్‌సి, బికాం, సిఎఎస్, బికాం జనరల్ కోర్సులో ఈ పరీక్షలకు మొత్తం 1462 మంది విద్యార్థులు హాజరుకాగా 606 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి విద్యార్థులకు అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఈనెల 30 నుంచి రెండు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఈ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 62 కేంద్రాల్లో జరుగుతున్నాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగే రెండో సెమిస్టర్ పరీక్షలు 9100 మంది, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగే నాలుగో సెమిస్టర్ పరీక్షలు 7100 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

ఎమ్మెల్యే కిరణ్ కుమార్ ప్రచారం

ప్రచారం చేస్తున్న కిరణ్ కుమార్

రణస్థలం: మండలంలలోని కృష్ణాపురం పంచాయతీలో శనివారం పలు గ్రామాల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వారి యోగక్షేమాలు తెలుసుకొని, వారికి అందుతున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో తమ్మినేని

వైసిపిలో పలువురు చేరిక

సరుబుజ్జిలి: మండలంలో మతలబుపేటకు చెందిన 15 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో ఉన్న వీరంతా జగన్మోహన్ రెడ్డి ఆశయాలు, ఆలోచనలు నచ్చి తాము వైసిపిలో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపిలు శివానంద బాబు, అనిల్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొవిలాపు చంద్రశేఖర్, బిసిసెల్ డైరెక్టర్ మూడడ్ల రమణ, ఎస్‌సిసెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధినిచ్చే స్థాయికి యువత ఎదగాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరూ ఇతరులపై ఆధారపడకుండా స్వయంశక్తితో ముందడుగు వేయాలని, ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ ఆకాంక్షించారు. శనివారం నగర పరిధిలో ది క్లాత్ అండ్ రెడీమేడ్ మర్చంట్స్ కళ్యాణ మండపంలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యాన జెమ్స్ బ్లడ్ బ్యాంక్ చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూసి యువత కూడా ఉన్నత స్థాయిలో, తల్లిదండ్రులు గర్వించేదగ్గ స్థాయికి ఎదగడానికి కృషి చేయాలన్నారు. ఆలోచనలకు పదును పెట్టి తనకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత వల్ల రక్తం కొరత ఉందని, యువత ముందుకొచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అత్యవసర చికిత్సల్లో రక్తం అవసరమవుతోందని, ప్రతిఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలన్నారు. ఈ శిబిరంలో 30మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరంలో త్రైక్వాండో శ్రీను, మాదారపు డేవిడ్, హోప్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కృష్ణ శ్రీ గోపాల్ పండ, యువత పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న దానేటి శ్రీధర్